

మహిళలు విద్యలో రాణించాలి

వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :మహిళలు విద్యలో రాణించాలని ఎపి వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం నగరంలోని జెండావీధిలో గల పిఎన్ఎం మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్ డే కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు. అబ్దుల్ అజీజ్ కోసం విద్యార్థులు ప్రత్యేక గానం తయారుచేసి, ఆ గానంతో ఆయనకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గతేడాది అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులను మెమెంటో తో సత్కరించారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, నా సొంత బిడ్డలు పలికినట్టు విద్యార్థులు స్వాగతం పలికారన్నారు. ఆడబిడ్డలకు ఉన్నత చదువులు అందించాలన్న ఆలోచనతో కాలేజీని స్థాపించామని మంచి ఫలితాలు సాధించి 150 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 1500 కు పెరిగే విధంగా కష్టపడాలన్నారు. జాఫర్ షరీఫ్, ఇంతియాజ్, నౌషాద్, జాఫర్, జమీర్, రబ్బానీ, అశ్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'కుబేర'..@ ఆధునిక మోసగాళ్లు..!

నెల్లూరు యాక్సెస్ బ్యాంక్‌లో భారీ దోపిడీకి పాల్పడిన కుబేరా టీమ్ ఆధునిక మోసాలకు పాల్పడింది. ఈ అవినీతి మరకలు రాష్ట్రమంతా విస్తరించినట్లు విశ్వసనీయ సమాచారం..."కుబేర.. నెల్లూరు " పేరుతో 'ప్రజాశక్తి"లో ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది. మీడియా మొత్తం ఈ కేసుపైనే దృష్టిపెట్టింది. ఆదివారం ఉదయం నుంచే పోలీసులు ఈ కేసుపై స్పీడ్ పెంచారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు ప్రత్యేకంగా ధర్యాప్తు నిర్వహిస్తున్నారు., .ఆర్‌బిఐ ఇటీవల డిజిటల్ అవెరెన్స్ క్రింద రుణాలు ఇచ్చే విధానం తీసుకొచ్చింది. దీనిని అసరా చేసుకొని, బ్యాంకర్ల సూచనలతో కొందరు ఆర్థిక నేరగాళ్లు ఈ అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. ఒక్క నెల్లూరులోనే రూ. 20 కోట్ల వరకు దొచుకున్నట్లు చెబుతున్నారు. రాష్ట్రమంతా డిజిటల్ అవెరెన్స్ విధానంలో వందల రూ. కోట్లలో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. బాధితులు ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఫిర్యాదు చేశారు. కేసులు వెనక్కి తీసుకోవాలని, మీడియా ముందుకు, పోలీసుల వద్దకు వెళ్లొద్దని ఆధునిక మోసగాళ్లు హెచ్చరికలు చేస్తున్నారు.

◆పోలీసుల విచారణ వేగవంతం
◆బాధితులకు బెదిరింపులు
◆మాకు ప్రాణభయం ఉంది : బాధితులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు యాక్సెస్ బ్యాంకు కుంభకోణం కొత్త మలుపులు తిరుగుతోంది. కేవలం నెల్లూరులోనే కాకుండా చెన్నైయ్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు విస్తరించినట్లు సమాచారం. ఈ ముఠా ఒక పక్కా ప్రణాళిక ప్రకారం ఇప్పటి వరకు మోసాలకు పాల్పడింది. విషయం బయటకు రావడంతో ఏం చేయాలో తెలియక బాధితులను బెదిరిస్తున్నారు. జిల్లా మొత్తంలో యాక్స్‌స్ బ్యాంక్ అధికారులు లెక్కల ప్రకారం 56 మంది ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించి రికార్డులు తయారుచేశారు. జిల్లాలో మరో 50 మంది వరకు బాధితులున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ మేనేజర్ మధన్‌మోహన్‌రావు విచారణ పూర్తి చేశారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది విచారణ జరిపి అవినీతి జరిగిందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై ఏడు నెలల కిందట ముత్తుకూరు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ కేసులో పోలీసులు అప్పుడే స్పందించి ఉంటే మాయగాళ్ల అట కట్టించేవారు. పోలీసులు నిర్లక్ష్యంగా ఉండడంతో మాయగాళ్ల అడిందే ఆట.. పాడిందే పాటగా సాగింది. మీడియాలో రావడంతో ఇప్పుడు రాష్ట్రమంతా బ్యాంకర్లు అప్రమత్తమయ్యారు. ఇటీవల హెచ్‌డిఎఫ్‌సి హైదరాబాద్ బ్రాంచ్‌లో రూ 150 కోట్లు అవినీతి బయటపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ కుంభకోణం ఆధునీకతను సంతరించుకుంది. టెక్నాలజీని ఉపయోగించుకొని ఈ వ్యవహారం జరిగింది. ఇటీవల ఆర్‌బిఐ డిజిటల్ అవెరెన్స్ ప్రోగ్రాం. తీసుకొచ్చింది. ఇదే మోసగాళ్లకు కల్పవృక్షమైయింది. ఇందులో ఏ వ్యక్తులకు సంబందం లేకుండా నేరుగా టెక్నాలజీ ఉపయోగించుకొని బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చు. ఈ విషయాన్ని బ్యాంకుల్లోని కొందరు ఉద్యోగులు సమాచారం ఇవ్వడంతో ఆర్థిక నేరగాళ్లు ఈ అవతారమెత్తినట్లు తెలుస్తోంది. నెల్లూరు నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. 1. జాలే వాసుదేవ నాయుడు 2. అల్లాభక్ష 3. శివకుమార్ 4. వెంకటేష్‌లు ఫేక్ సాఫ్ట్‌వేర్ కంపెనీల పేరుతో ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. 1. అవి నెట్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్.. 2. ఎంఆర్ ఇన్ఫ్రా లైన్, 3. గ్లోబల్ సొల్యూషన్ 4. క్యాపిటల్ ట్రీ స్టాఫ్ వేర్ కంపెనీల పేరుతో వ్యవహారం నడిపిన విషయం తెలిసిందే.

డిఎస్‌పి విచారణ ప్రారంభం

యాక్సెస్ బ్యాంక్ కుంభకోణం ఏడు నెలల కిందటే బయటకొచ్చింది . నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ మేనేజర్ మధన్‌మోహన్‌రావు 2024 డిసెంబర్ 12న ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్‌ఐఆర్ నెంబర్ 179-2014 పేరుతో కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు పక్కన పడేశారు. విషయం బయటకు రావడంతో ఆదివారం ఉదయం నుంచి హడవడి పడిపోతున్నారు. 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనంతో ఉన్నతాధికారులు స్పందించారు. నెల్లూరు రూరల్ డిఎస్‌పి జి. శ్రీనివాసరావు కేసును నేరుగా ధర్యాప్తు చేస్తున్నారు. . బ్యాంక్ అధికారులతో మాట్లాడి, వివరాలు స్వీకరించారు. మొత్తం జాబితా పరిశీలించారు. ఎక్కడ ఏం జరిగింది. బాధితుల వివరాలను బ్యాంక్ మేనేజర్ మల్లిపల్లి మధన్‌మోహన్‌రావు డిఎస్‌పికి అందజేశారు. బ్యాంక్ డబ్బు కాజేసిన వ్యక్తుల వివారాలు సమర్పించినట్లు తెలిసింది. "ప్రజాశక్తి" కథనంతో పోలీసులు విచారణ వేగవంతం చేయడంతో బ్యాంక్ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే నేరగాళ్ల హైదరాబాద్, బెంగళూరు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడినట్లు తెలుస్తోంది. కొందరు సినిమా నిర్మాణాలు చేస్తున్నారు.

బ్యాంకు జారీ చేసిన నోటీసును చూపుతున్న బాధితులు

రాష్ట్రమంతా చిలక్కొట్టుడే..!

నెల్లూరు యాక్సెస్ బ్యాంక్ కుంభకోణం కేవలం నెల్లూరులోనూ కాకుండా చెన్నైయ్, విశాఖపట్నంతోపాటు పలు ప్రాంతాలకు విస్తరించినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదలతోపాటు ఫేక్ కంపెనీల్లో పనిచేసే వాచ్‌మెన్‌లు, వారి బంధువులు, ఆఫీసు బాయ్, సిబ్బంది ఇలా అందరి పేర్లపైనా రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. జాలే వాసుదేవనాయుడు తన కార్యాల యంలో పనిచేసే తనుజా పేరుతో చెన్నైయ్ యాక్సెస్ బ్యాంక్‌లో రూ 35 లక్షలు, నెల్లూరులో రూ 10 లక్షలు, విశాఖపట్నంలో రూ 23 లక్షలు రుణం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నెల్లూరు నగరం వనంతోపుకు చెందిన కోటయ్య (ఆఫీసు సెక్యూరిటీ గార్డు) భార్య పేరుతో రూ 50 లక్షలు, నవాబుపేటకు చెందిన స్వప్నిక ఆఫీసులో పనిచేస్తుండగా ఆమె పెద్దమ్మ పేరుతో రూ 12 లక్షలు, ఎస్‌కె కరీముల్లా (కెమరామెన్) రూ 10 లక్షలు, ఇలా అనేక మంది బాధితులు వివరాలు తెలుస్తున్నాయి. ఈ కుంభకోణం బయటకు రావడంతో ఒకొక్కరు బయటకు వస్తున్నారు. పోలీసులు లోతుగా విచారిస్తే కోట్లలో అక్రమాలు బయటపడుతాయని భాధితులు చెబుతున్నారు . అల్లాభక్ష గతంలో టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులుగా పనిచేశారు. ఎస్ఎబి క్రియేషన్ పేరుతో సినిమా నిర్మాణం చేస్తున్నట్లు తెలిసింది.

మాకు బెదిరింపులు వస్తున్నాయి..

-'కుబేర' బాధితులు

మాకు బ్యాంక్ ఎక్కడుందో తెలియదు. నాలుగో తరగతి చదువుకున్న నన్ను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చిత్రికరించారు. నాకు తెలియకుండానే రుణం తీసుకున్నారు. నాలుగు రోజుల క్రితం చెన్నైయ్ యాక్సెస్ బ్యాంక్ నుంచి నోటీసులు రావడంతోనే నాకు విషయం తెలిసిందని, లక్ష్మీనారాయణ, ఆయన భార్య మీడియాకు తెలిపారు. మా గ్రామానికి చెందిన సుధాకర్ ఏజెంట్‌గా కొందరు వ్యక్తులను తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పుడు బెదిరిస్తున్నారని, ఎవ్వరికీ చెప్పవద్దని, బ్యాంక్‌లో లోను మేమే కడుతాం, లేదంటే మీరే కట్టుకోవాలని చెబుతున్నారని వాపోయారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య మాట్లాడుతూ గిరిజ నులను మోసం చేసి నలుగురు వ్యక్తులు ఈ కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. విచారణ జరిపితే వాస్తవాలు బయట కొస్తాయని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో న్యాయం జరగకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-నెల్లూరు

, పారిశుధ్య పనుల నిర్వహణ కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిట విమర్శించింది. మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ఎనిమిది రోజుల నుంచి సమ్మెబాట పట్టారు. ఆదివారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్వతంత్ర పార్కు నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మానవహారం నిర్మించారు. తమ సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నగర గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే పెంచల నరసయ్య లు ప్రసంగించారు. 8 రోజులుగా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ నాయకులు సుధాకర్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్ ఎం సునీల్ కుమార్, తాళ్లూరి రమేష్, షబ్బీర్,మరియన్న, లోకేష్ శ్రీనివాసులు,రాంబాబు, మాలకొండయ్య, కామాక్షమ్మ,చంద్రమ్మ,కొండమ్మ,సలోమి,సుజాతవమ్మ,వజ్రమ్మ, మట్టిపాటి శ్రీనివాసులు,బాలమురగన్, ముని మోహన్ బాబుతదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనంగా రూ.26 వేలు అందజేయాలని వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(వీఆర్‌ఏ) జిల్లా నాలుగో మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు జి. ఓబులేష్ అధ్యక్షతవహించారు. బందగీ సాహెబ్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ల నుండి ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు గతంలో రాష్ట్రంలో నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా వీఆర్‌ఏలకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అమలు చేయలేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీ ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం వీఆర్‌ఏలు అంతా ఐక్యంగా ఉద్యమించాలని, మీ పోరాటాలకి సిఐటియు అండగా నిలుస్తుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం 15 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష కార్యదర్శులుగా వెన్నుపాటి లచ్చయ్య, జి. ఓబులేసును ఎన్నికున్నారు వీఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కే. పెంచల నరసయ్య, వీఆర్‌ఏ నాయకులు సుబ్బయ్య, ఎస్కె అమీర్, భాస్కర్, సుధాకర్, నారాయణ, హజరత్, భాస్కర్, అంకయ్య, వెంకటకష్ణ, సత్యవతమ్మ ఉన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులు వి లచ్చయ్య, జి ఓబులేసు

విద్యతోనే ఉన్నత స్థితి..!

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :తల్లిదండ్రులు వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, ప్రతి నిత్యం పిల్లల చదువులపై ప్రత్యేక దష్టి సారించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు.ఆదివారం నగరంలోని పరమేశ్వరీ కల్యాణ మండపంలో అఖిల గాండ్ల, తెలికుల కులస్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు గ్రోసు సుబ్బారావుగారి సహాయ సహకారాలతో 10, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేతలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు గిద్దలూరు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి హర గోపాల్, కుల సంఘ నాయకులు, టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, ముంగమూరు చైతన్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు :విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను 2007లో ఏవిధంగా రెగ్యులర్ చేశారో అదేవిధంగా ఇప్పుడు కూడా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మికుల న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపించాలంటూ దశల వారీగా పోరాటాలు చేస్తున్నా యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆగష్టు 7వ తేదిన ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యుఈఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంచలప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యుఈఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంచలప్రసాద్ ఆగష్టు 7న నిర్వహించతలపెట్టి ఛలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరణ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి గోగుల మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యుఈఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంచల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుమన్ ,జిల్లా అధ్యక్షులు గోగుల మహేష్ మాట్లాడారు. యుఈఈయు నాయకులు నాగయ్య, దయాకర్,మస్తానయ్య, రాజు,రామయ్య,లక్ష్మీపతి,ప్రసన్న కుమార్,కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఆరిఫ్,మౌలా,రామారావు,బాస్కర్, భరత్,జెన్‌కో నాయకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

ఎంఎల్‌ఎ 'ఇంటూరి'కి స్వాగతం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మండలం ఓగూరు గ్రామంలో ఆదివారం జరిగిన చల్లా వారి దేవర కొలుపుల కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.ముందుగా ఎమ్మెల్యే ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ముందుగా ఈ కార్యక్రమానికి చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారికి ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారుపట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు

మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-కందుకూరు కందుకూరు పట్టణంలోని మొబైల్ వ్యాపార రంగంలో ప్రతి మొబైల్ రిటైలర్, విడిభాగాల విక్రేత, దుకాణం ఉన్న మొబైల్ రిపేర్ టెక్నీషియన్ , దుకాణం లేని మొబైల్ రిపేర్ టెక్నీషియన్ల సంక్షేమం కోసం పనిచేయాలని కందుకూరు మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.ఆదివారం ఇక్కడ సమావేశం జరిగింది. ప్రెసిడెంట్‌గా షేక్ రియాజ్, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ సలాం, సెక్రటరీగా సయ్యద్ సాజిద్, జాయింట్ సెక్రెటరీగా చేజర్ల ఓంకారం, ట్రెజరీగా రతన్ సోలంకి, మెంబర్స్‌గా షేక్ నజీర్, నున్న కష్ణ, హైదర్, ఆదిరెడ్డి, నరేష్, ఆయుబ్, సతీష్, చారి, హబీబ్, అలీ,దిలీప్, నరేంద్ర, హిదయత్, మణి, అనిల్, జవీద్, సనా, రబ్బానీ, జై కష్ణ, సురేష్, ప్రతాప్ తదితరులను ఎన్నుకున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై హై కోర్టు స్టే

వేలంలో గదులు దక్కించుకునక్నవారు లబోదిబో..

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరుఅంకమ్మ తల్లి దేవాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కొందరు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకోవడంతో బహిరంగ వేలంలో కాంప్లెక్స్ గదులు పాడుకున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దేవాలయం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ పనికి వచ్చే కోట్ల విలువ చేసే స్థలం ఉంది.ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయడం ద్వారా దేవాలయ అభివృద్ధికి నిధులు సమకూరుతాయని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు భావించారు.దీంతో దగదుల నిర్మాణానికి బహిరంగ వేలం నిర్వహించారు. దాదాపు 50 మంది రూములను దక్కించుకోవడానికి వేలంలో పోటీపడ్డారు. అధికారులు ప్రజా ప్రతినిధులు భావించిన దానికంటే ఎక్కువ మొత్తంలో రూములను వేలం పాడారు. ఒక నెలకి దాదాపు రూ. 2.80లక్షల వంతెన ఏడాదికి సుమారు 30 లక్షల ఆదాయం వచ్చే విధంగ యాలం పాటలు కొనసాగాయి. వేలంలో లో గదులు పాడుకున్నవారు. ఒక్కొక్కరు రూ. 2.25 లక్షలు దేవాదాయ శాఖకు డిపాజిట్ చేశారు. .ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. షాపింగ్ కాంప్లెక్స్ లో గదులు దక్కించుకున్న 24 మంది ఇప్పటికే నిర్మాణ పనులు సొంత నిధులతో చేపట్టారు ఈఈ తరుణంలో నిర్మాణ పనులు ఆపాలని కోర్టులో స్టేలు తెస్తే మా 24 కుటుంబాల పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. గతంలో అంకమ్మ దేవాలయం చుట్టూ ఉన్న స్థలం ఒక్క రూపాయి కూడా ఆదాయం రాని పరిస్థితులు ఉంటూ వచ్చాయని డాక్టర్ తన్నీరు మల్లికార్జున చెప్పారు. అక్రమణలను తొలగించి ఆలయ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తుంటే దానిని ఆటంకపరచడానికి కొందరు వ్యక్తులు కంకణం కట్టుకున్నారన్నారు.ప్రస్తుతం కొంత మంది దేవాలయం జాతర్లకు ఇబ్బందికరంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారనే పేరుతో స్టే తీసుకొచ్చారు. ఎండోమెంట్ అధికారుల నిర్ణయం మేరకు నిర్మాణాలు చేస్తుంటే వాటికి ఆటంకాలు కలిగిస్తే తాము రూములు ఎలా నిర్మించుకోవాలని రూములు వేలం పాడిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టులో కొందరు గదుల నిర్మాణం ఆపాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈనెల 21 వరకు నిర్మాణ పనులు యథావిధిగా ఉంచాలని స్టే విధించారు. ఎమి జరుగుతుందో వెచిచూడాలి.

నిలిచిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

ప్రజలకు సత్వర న్యాయ సేవలు

ప్రజాశక్తి-నెల్లూరు

న్యాయ వ్యవస్థ, పోలీసు శాఖ రెండు సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం చేయగలమని, తద్వారా ప్రజలకు రెండు వ్యవస్థలపై నమ్మకం, గౌరవం పెరుగుతుందని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ హాజరయ్యారు. సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించి, ప్రజాజీవన విధానంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడమే పోలీసు శాఖ భాధ్యత అన్నారు.కొత్త చట్టాలు అమలులో ఉన్నందున క్షుణ్ణంగా అవగాహన పొందాలని, అందుకు ఇరుశాఖల సమన్వయము కొరకు తగిన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలు ఇతర కేసుల నమోదు, చేధనల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి,సిడి ఫైల్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య , లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి , పిపి, ఎస్‌బి, టౌన్, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు, ఉమెన్ పిఎస్ , ఏఆర్, ట్రైనింగ్ డిఎస్‌పి లు, ఇతర జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లాజ జడ్జి జి శ్రీనివాస్

'కుబేర' కేసును సిబిఐకి అప్పగించాలి

బాధితులు డిమాండ్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు యాక్సెస్ బ్యాంకులో జరిగిన కుంభకోణంపై సిబిఐ విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. జాలే వాసుదేవనాయుడు, అల్లాభక్ష, వెంకటేష్, శివలు ఫేక్ కంపెనీ లను సష్టించి ఎస్‌సి, ఎస్‌టిలను సాఫ్ట్ వేర్ ఉద్యోగులుగా చూపి మోసం చేశారన్నారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా కేసు నమోదు చేసి ఎనిమిది నెలలు అయినా ఎలాంటి చర్యలు లేవన్నారు. విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసి, భాదితులకు న్యాయం చేయాలి డిమాండ్ చేశారు. దీని వెనుక కొంతమంది బ్యాంకు సిబ్బంది పాత్ర కూడా ఉందన్నారు. బాధితుల చలంచర్ల లక్ష్మినారాయణ, ఆయన భార్య జరిగిన మోసాన్ని వివరించి భోరున విలపించారు. విలేకర్ల సమావేశంలో సంఘం జిల్లా చైర్మన్ రాపూరు కష్ణయ్య, జిల్లా అధ్యక్షులు మానికల మురళీ, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్ర, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న కెసి పెంచలయ్య

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక 31వ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో ఐద్వా నూతన కమిటీ ఏర్పాటైంది. ఆదివారం ఆ ప్రాంతంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరతమ్మ, రాధమ్మలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఐద్వా నేతలు మాట్లాడుతూ మహిళలందరూ ఐకమ త్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలన్నారు. 31 డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎం సుధాకర్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు మన ప్రాంతానికి రానికుండా అడ్డుకోవాలని తెలియజేశారు స్మార్ట్ మెటల్ వద్దు కరెంటు చార్జీలు తగ్గించమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాధమ్మ వెంకటరత్నమ్మ రాజ్యలక్ష్మి రమాదేవి రఫీ యా సిఐటియు నాయకులు షబ్బీర్ పాల్గొన్నారు

బందోబస్త్ మధ్య గంగమ్మ పొంగళ్లు

-తిమ్మారెడ్డిపాలెం -గంగపాలెం పొలిమేర వద్ద ఉద్రిక్తత
-విగ్రహాల ప్రతిష్టాపన, జంతు బలిపై రెండు గ్రామాల మధ్య వివాదం
-రెవెన్యూ, పోలీస్ అధికారుల చొరవతో సమస్య పరిష్కారం

రెండు గ్రామాల పెద్దలతో మాట్లాడుతున్న తహశీల్దార్, పోలీసులు

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని తిమ్మారెడ్డి పాలెం సమీపంలోని గంగమ్మ గ్రామ దేవత ఆలయం పొంగళ్లు సందర్భంగా జంతు బలి చేసే విషయమై రెండు గ్రామాల మధ్య గత రెండు రోజుల నుంచి వివాదం నెలకొని ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రెండు గ్రామాలకు చెందిన పెద్దలు ఈ విషయమై చర్చించుకున్నప్పటికీ సమస్య కొలిక్కి రాలేదు.ఈ విషయం పోలీస్ స్టేషన్ కు శనివారం సాయంత్రం చేరింది. తాము గంగమ్మకు పొంగళ్లు పెట్టుకుంటున్నామని ఈ కార్యక్రమాన్ని తిమ్మారెడ్డి పాలెం గ్రామానికి చెందినవారు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గంగపాలెం గ్రామస్తులు తెలిపారు.

తిమ్మారెడ్డి పాలెం,గంగపాలెం గ్రామాలకు సంబం ధించిన గంగమ్మ తల్లి గ్రామ దేవత ఆలయం వద్ద ఆదివారం పొంగళ్ల సందర్భంగా జంతువులు బలిచ్చేందుకు గంగపాలెం గ్రామస్తులు నిర్ణయించారు. అయితే విషయం తెలుసుకున్న తిమ్మారెడ్డి పాలేనికి చెందిన గ్రామస్తులు గంగపాలెం గంగమ్మ దేవాలయం వద్దకు వెళ్లి అడ్డుకోబోయారు.తిమ్మారెడ్డి పాలెం గ్రామస్తులు మరో గంగమ్మ దేవాలయం కొత్తగా నిర్మించారు.ఆ ఆలయంలో పురాతన గంగమ్మ దేవాలయంలోని విగ్రహాలను ప్రతిష్టించాలని నిర్ణయించారు.ఈ పాత గంగమ్మ దేవాలయం రెండు గ్రామాలకు సంబంధించింది. ఆ విగ్రహాలను కొత్త దేవాలయంలో పెట్టేది లేదని గంగపాలెం గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై వివాదం నెలకొంది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ సీతామహాలక్ష్మి, గుడ్లూరు సిఐ మంగరావు, ఎస్ఐలు నారాయణ,వెంకట్రావు పోలీసుల బృందం అక్కడికి చేరుకున్నారు. ఇరు గ్రామాలకు చెందిన పెద్దలతో చర్చలు జరిపారు.తిమ్మారెడ్డి పాలెం గ్రామస్తులు తాము కొత్తగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఆగస్టు 1న పొంగళ్లు ఏర్పాటు చేశామని, అందువల్ల గంగపాలెం గ్రామస్తులు పొంగళ్లు మాత్రమే చేసుకోవాలని జంతువులను బలివ్వడానికి లేదని షరతు పెట్టారు. అందుకు గంగపాలెం గ్రామస్తులు ఒప్పుకోలేదు. అనాది తాము పొంగళ్ల సందర్భంగా జంతుబలి ఇవ్వడం ఆనవాయితీగావస్తుందని, జంతుబలి లేకపోతే ఎలా అని తెలిపారు. అయితే తహశీల్దార్ సీత మహాలక్ష్మి ఈ ఆలయం వద్ద పొంగళ్లు మాత్రమే నిర్వహిం చాలని, జంతు బలి చేయడానికి లేదని తెలిపారు. నిబంధనల రీత్యా జంతబలి నిషేధమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దీంతో మరోసారి ఇరు గ్రామాల పెద్దలతో చర్చించి గంగపాలెం గ్రామస్తులు కేవలం పొంగళ్ల మాత్రమే పెట్టుకునేందుకు ఒప్పించారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో గంగపాలెం గ్రామస్తులు ఊరేగింపుతో వచ్చి పొంగళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుకు విగ్రహనికి 101 బిందెల నీళ్లతో అభిషేకం చేశారు.ఈ సందర్భంగా తిమ్మారెడ్డి పాలేనికి కొందరు మహిళలు యువకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని దూరంగా పంపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా చర్యలు తీసుకోవడంతో గంగపాలెం గ్రామస్తులు పొంగళ్ళు ప్రశాంతంగా పెట్టుకున్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి తాను ఒక సేవకుడిగా పని చేస్తానని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.కందుకూరు పట్టణంలోని 27వ వార్డు విప్పగుంట రోడ్డులోని వినాయక స్వామి విగ్రహం వద్ద జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు శివ సూర్య, పార్టీ నాయకులు ఉన్నం వీరస్వామి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, తలమంచి బ్రహ్మయ్య, సవిడిబోయిన కష్ణ, కొత్తకోట మహేష్, కొత్తకోట మాల్యాద్రి, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, తన్నీరు సుధాకర్, పాకల మాల్యాద్రి, గొర్రెపాటి రోశయ్య, మేడ మల్లికార్జున, దామా రాంబాబు, రావూరి రామకోటయ్య, గడ్డం మాలకొండయ్య పాల్గొన్నారు.

ఎస్‌పికి అస్వస్థత

ప్రజాశక్తి-నెల్లూరు : ఎస్‌పి జి.కృష్ణకాంత్ అస్వస్థతకు గురికావడంతో వైద్య చికిత్సల నిమిత్తం నగరంలోని ప్రముఖ వైద్యశాలకు హుటాహుటిన తరలించారు. గతంలో ఒక సారి ఎస్‌పి ఒత్తిడికి గురై తద్వారా అనారోగ్యానికి గురికావడంతో వైద్యచికిత్సలు తీసుకున్నారు. మళ్లీ రెండోసారి కళ్లు తిరగటం, నీరసించడంతో చికిత్సల నిమిత్తం కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక హబీబియా ఆసుపత్రిలో డాక్టర్ ఖాజా మియా పర్యవేక్షణలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నెల్లూరు సుశీల కంటి ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొని కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కంటి సమస్యలు కలిగిన రోగులు భారీగా ఈ శిబిరానికి హాజరయ్యారు. 120 మంది రోగులను పరీక్షించి, 40 మందికి కంటి శుక్లాలు ఆపరేషన్లు చేయనున్నట్టు డాక్టర్లు తెలిపారు. ఆపరేషన్ల కోసం నెల్లూరులోని తమ ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేసిన అనంతరం తిరిగి ఎఎస్‌పేటకు ప్రత్యేక వాహనంలో రోగులను వారివారి ఇంటికి ఉచితంగా తీసుకెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో సుశీల కంటి వైద్య ఆసుపత్రి సిబ్బందులు డాక్టర్ విజయ్ బెక్కీష్టియన్లు ఫిరోజ్ నరసింహ, ఆసుపత్రి పిఆర్ఒ షాకీర్, హబీబీ ఆసుపత్రి సిబ్బంది పుష్ప, నాయక్, నస్రీన్ టిడిపి నాయకులు వీర ప్రతాప్, షఫీ, నజీర్ తదితరులున్నారు.

మిక్కిలింపేటలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని మిక్కిలింపేట గ్రామంలో ఏన్నోళ్ళ నుండి సైడ్ కాలువల పూడికతో గ్రామస్తులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై మిక్కిలింపేట సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డి, కోడూరు సుధాకర్ రెడ్డి దృష్టి సారించి స్థానిక ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి తెలియచేయగా వెంటనే సైడ్ కాలువలు పూడికతీత పనుల ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా చూడాలని తెలియజేశారు. వెంటనే సర్పంచ్ స్పందించి ఆదివారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గ్రామాలు అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నాయని ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కోవూరులో మొట్టమొదటిసారిగా మహిళ ఎంఎల్ఎ వచ్చిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో గండవరం బిట్-2 చైర్మన్ కోడూరు సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, గ్రామ అధ్యక్షులు కర్నాటి ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి పి.వేణుగోపాల్, ఉక్కాల నరసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం..

ప్రజాశక్తి-కావలి : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి టియుసిసి అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఆదివారం శ్రీనివాస కళ్యాణ వేదిక హాలులో టియుసిసి కేంద్ర కమిటీ సభ్యులు బి.రామచంద్రయ్య అధ్యక్షతన నేతాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టియుసిసి) సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డివిఎన్ రాజు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాదిమంది కార్మికులకు అండగా టియుసిసి జాతీయ గుర్తింపు పొందిన ప్రధాన కార్మిక సంస్థగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (డబ్ల్యూఎఫ్‌టియు) అనుబంధ సంస్థగా టియుసిసి, జాతీయస్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 1925 బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కూడాతొలగిస్తుందని, వందేళ్ల కార్మిక ఉద్యమ చరిత్రలో కార్మికులకు చట్టబద్ద రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ పారిశ్రామికీకరణను నిర్వీర్యం చేస్తుందన్నారు. సమావేశంలో నేతాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టియుసిసి) నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా డివిఎన్ రాజు, అధ్యక్షులుగా కె.ఏసు, ఉపాధ్యక్షులుగా చెట్టుపల్లి మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శెట్టిపల్లి రవి, జాయింట్ కార్యదర్శిగా భాను ప్రకాష్, ట్రెజరర్ చెట్టుపల్లి ఆదిలక్ష్మి, జాయింట్ ట్రెజరర్ శెట్టిపల్లి ఎలమందయ్య, కావలి అనిల్ కమిటీ సభ్యులుగా రేవతి, వెంకయ్యమ్మ, బుజ్జమ్మ, శివలింగయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : యువత క్రీడలలో రాణించాలని మాజీ ఎంపిటిసి శ్రీహరికోట ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని నరసాపురం ఎం.ఎ.ఒ.సి జిల్లా పరిషత్ పాఠశాల నందు మార్నింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన డివిజన్ వారియర్స్ టీం సభ్యులకు మాజీ ఎంపిటిసి శ్రీహరికోట ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసి గెలుపొందిన, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడుమార్గం వైపు వెళ్లకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. నేడు అనేక వ్యసనాలతో యువత పెడదారి పడుతుందని, ఖచ్చితమైన లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం తో పాటు శారీరక ధృఢత్వం ఏర్పడుతుందన్నారు. ఆర్గనైజర్ సురేష్, నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు పేర్కొన్నారు. బిట్రగుంట వాకర్ సభ్యుడు కోపూరుపల్లి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మద్ది సుధాకర్ జన్మదిన సందర్భంగా బిట్రగుంట రైల్వే క్రీడామైదానంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆదివారం మొక్కలు నాటారు. జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, ప్రత్యేక ట్రీగార్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, వ్యవస్థాపకులు పృథ్వీరాజ్, ఫౌండర్ కుందుర్తి శ్రీనివాసులు, అధ్యక్షులు బర్నాడ్, జీవన్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. స్టార్ ఫ్రెండ్స్ శ్యామ్, తిరుమల, అనిల్, రాజేష్, సభ్యులు శేషమ్మకుమార్, నత్తం, శేఖర్, రమణారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ మనోహర్ నాయుడు, శ్రీహరిబాబు, జర్నలిస్టులు ఏసురాజు ప్రభాకర్ రెడ్డి, సంజయ్ రెడ్డి, మహేశ్వర్, పిల్లలు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు, ఆర్పీ విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికి తెలుగుదేశం'

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరులోని సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వింజమూరులోని 3వ బజారులో టిడిపి ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ అర్జీదారుల అర్జీలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారు అందిన వారి గురించి వివరాలు సేకరించడం జరుగుతున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వాహణ కార్యదర్శి చల్ల వెంకటేశ్వర్లు, వింజమూరు మండల కోకన్వీనర్ మంచిరాజు శ్రీనివాస్ నాయుడు, టౌన్ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాదల శీను, కృష్ణ, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో వెలసి ఉన్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారు భక్తులకు శాకాంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు పండ్లతో అమ్మవారిని, గుడి ఆలయ ప్రాంగణమంతా ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 16 సంవత్సరాల నుండి కుటుంబ సభ్యులు దేవదాయ సురేష్ అమ్మవారికి నిర్విరామంగా శాకాంబరి అలంకారం ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యమని కొనియాడారు. అమ్మవారి ఆశీస్సులు ఆయన కుటుంబానికి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, రావెళ్ల వీరేందర్ నాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, బొద్దుకూరు సుధీర్, ఆలయ ఇఒ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు శివాలయంలోని వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామి శ్రీ వల్లీ దేవసేన దేవేరుల కళ్యాణ మహోత్సవం ఆదివారం ఉదయం 10 గంటల నుండి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూల అలంకరణలతో శ్రీదేవిబూను అలంకరించి పూజలు చేశారు. అనంతరం ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులందరికీ అన్నదానం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కళ్యాణ మహోత్సవం ఒంటిగంట నుండి అన్న ప్రధాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవ సందర్భంగా గత వారం రోజులుగా శ్రీ స్వామివారి మాలధారణ కార్యక్రమం నిర్వహించిన భక్తులు విగ్రహాలకు ఉదయకర్తలు స్వామి సేవకులు కార్యనిర్వహణ భక్తులు అందరు కలిసి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాలుపంచుకుని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమంలో విగ్రహాలు ఉదయకర్తలు మాలధారణ భక్తులు స్వామి సేవకులు ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె..

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వెంటనే జీతాల పెంచాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని సిఐటియు ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. వారికి మద్దతుగా అన్ని కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు సుమారు 300మంది కార్మికులు ర్యాలీలో పాల్గొని నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, యుటిఎఫ్ సంఘాల ఉపాధ్యాయులు, ఎల్ఐసి ఉద్యోగులు, ఎపిఎస్ఆర్‌టిసి, ఎస్‌డబ్ల్యూ కార్మికులు, ఐద్వా (మహిళా సంఘాలు) నాయకులు భవన నిర్మాణ సంఘం, ఆటో యూనియన్ కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం వేతనం చెల్లించాలని, గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను బేషరతుగా మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని వక్తలు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి సమ్మెను పరిష్కరించాలని లేనియెడల సిఐటియు నాయకత్వంలో సమ్మెను ఉధృతం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు పి.రాధమ్మ, రమణమ్మ, షేక్ హమీద్, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు పద్మ, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్.కె.హయత్ భాషా, నరసింహులు, ఎల్ఐసి యూనియన్ నాయకులు టి రమేష్, యుఇఇయు నాయకులు మహేష్, ఐద్వా నాయకురాలు పి.లక్ష్మమ్మ, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు పి.జిలాని, యుటిఎఫ్ నాయకులు శివప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, చిన్న బాబు, రిజ్వాన్, గురవయ్య, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె కావలిలో ఆదివారం నాలుగవ రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద సిఐటియు నాయకులు జి.మధుసూదన్ రావు కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు వారం రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోవడం చాలా అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికులకు సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను ఇబ్బందులకు గురి చేసే విధానాలను తీసుకొస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పట్టించుకుని కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిడదల మహేష్, ఒంగోలు రమేష్, క్రాంతికుమార్, ఎస్‌కె.షాన్‌వాజ్, మహిళా నాయకులు పల్లెపాటి అనిత, అప్పాటి జ్యోతి, కార్మికులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాష్టీకం

- కాళ్లు, చేతులు నరికివేత - తానే ఘటనకు పాల్పడినట్లు నిందితుడి సెల్ఫీ

ప్రజాశక్తి-దగదర్తి

చికిత్స పొందుతున్న బాధితురాలు

అనుమానమే పెనుభూతంగా మారి కసాయిగా మారిన ఓ భర్త తన భార్యను కర్కశత్వంతో కాళ్లు, చేతులు నరికి దాష్టీకానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. గతంలో ఓ పార్టీ నాయకుడి వద్ద సంవత్సరాల తరబడి డ్రైవర్‌గా పని చేసిన బుచ్చిరెడ్డిపాలెం జెండా దిబ్బ సెంటర్‌కు చెందిన షేక్.మున్వర్ ఐదు నెలల క్రితం దగదర్తి మండలం తడకలూరు గ్రామంలో తన భార్యతో కలిసి కాపురం పెట్టాడు. 9 సంవత్సరాల క్రితం బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన సుల్తానాతో మున్వర్ వివాహం జరిగి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడిని కలిగి ఉన్నాడు. మున్వర్ భార్య సుల్తానా పేరుతో తడకనూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ.30 లక్షల రుణం పొంది ఉన్నట్లు సదరు ఫైనాన్స్ కంపెనీ రుణ వేధింపులతో వారు వారి కాపురాన్ని తడకలూరుకు మార్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడికి అనుచరుడైన బంధువైన వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందంటూ మున్వర్ తరచూ వేధించేవాడని భార్య సుల్తానా తరఫున బంధువులు ఆరోపిస్తున్నారు. 18వ తేదీ వేకుజామున 3 గంటల సమయంలో మున్వర్ భార్య అయిన సుల్తానా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీ అమ్మాయిని నరికివేశానని రాజుపాలెం సమీపంలో ఉన్నామని తాను వెళ్లిపోతున్నానని మీ అమ్మాయిని కాపాడుకోండి.. అంటూ ఫోన్ చేయడంతో భయపడిన కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజుపాలెంకు చేరుకోగా.. నెత్తుటి మయంగా మారి ఉన్న సుల్తానాను చూసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం నారాయణ వైద్య కళాశాల ఆసుపత్రికి చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ కేసు విషయమై నగదు ఎస్ఐ జంపాణి కుమార్‌ను వివరణ కోరగా.. ఆసుపత్రి నుండి సమాచారం అందిన వెంటనే కేసు నమోదు చేశామని హత్యాయత్నం, కొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఉన్నామని నిందితుడు పరారీలో ఉన్నాడని అతనిని పట్టుకునేందుకు తాను, తమ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు.

నిందితుడి సెల్ఫీ వీడియో..

భార్య సుల్తానాను పాశవికంగా నరికిన భర్త మున్వర్ సెల్ఫీ చేసిన వీడియో ఒకటి వైరల్‌గా మారుతుంది. తడకలూరు గ్రామానికి చెందిన జలదంకి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన భార్యను బ్లాక్ మెయిల్ చేసి బలవంతంగా అనుభవించినట్లు సంఘటన జరిగిన రోజు తాను ఇంటికి వెళ్లేటప్పటికీ వారిద్దరు ఇంట్లో ఉండగా ప్రశ్నించినందుకు వారిద్దరూ తనను హత్య చేయబోయారని తాను తప్పించుకుని వాళ్లను ఎదుర్కొనే క్రమంలో సదరు వ్యక్తి తప్పించుకుని పారిపోగా తన భార్యను నరికినట్లు తాను ముస్లింగా ఒక ఇంటివాడిని కావడంతో తనకు ఇలా జరిగినట్లు తన పిల్లలు ఒంటరివారిగా ఉన్నట్లు సెల్ఫీలో పేర్కొనడం గమనార్హం. సెల్ఫీ విషయమై ఎస్ఐ జంపని కుమారుని వివరణ కోరగా.. సెల్ఫీ విషయం ఇప్పుడే తన దృష్టికి వచ్చిందని దానిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పేదరికం లేని సమాజమే పి4 లక్ష్యం

ప్రజాశక్తి-కోవూరు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పి4ను అమలు చేస్తూ చంద్రబాబు నాయుడు సుపరిపాలన అందిస్తున్నారన్నారని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని ఎంఎల్ఎ నివాసంలో నిర్వహించిన కోవూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పి-4 విధానం ద్వారా 2029 నాటికి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఆగస్ట్ 15 నాటికి 6వేల నుండి 10వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించాలని ఆ లక్ష్య సాధన కోసం అధికారులు పక్కా ప్రణాళికతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోవూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులతో సర్వే చేయించి పి4 మార్గదర్శకులను గుర్తించి వారికి పి-4 విధానంపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాల వారీగా ఆసంపన్నులను గుర్తించి విదేశాలలో స్థిరపడిన వారు తమ సొంత గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే సదుద్దేశం వున్న వారిని గుర్తించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల యజమాన్యాలు కొన్ని కుటుంబాలను దత్తత చేసుకొనేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదరికం నిర్మూలన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎంపిడిఒలు, తహశీల్దార్లు, నియోజకవర్గ విజన్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆశావర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-దుత్తలూరు

ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. ఆదివారం దుత్తలూరు సిహెచ్‌సి నర్రవాడ పిహెచ్‌సి ప్రాథమిక కేంద్రం సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి దుత్తలూరు మెయిన్ పాఠశాలలో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆశావర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 9 ఒప్పంద జిఒలను ఈ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆశలకు పని భద్రత కల్పించాలని కనీస గౌరవ వేతనం రూ.26వేలు ఇవ్వాలని అనివార్యంగా ఆశావర్కర్ చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పనిఒత్తిడి తగ్గించాలన్నారు. 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ సర్వీసు నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు ఇవ్వాలని ప్రభుత్వమే రికార్డులు ఇవ్వాలని గ్రామాలలో టిబి పరీక్షలు ఆశాలతో చేయించరాదని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఉపాధ్యక్షురాలు డి.మేరీ మాట్లాడుతూ ఆశాలకు రక్షణ కల్పించాలని, పని భారం తగ్గించాలని కోరారు. అనంతరం 11మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. మండల అధ్యక్షులుగా రుక్మిణి, కార్యదర్శిగా ఎస్‌కె.షకీలా, కార్యదర్శి టి.అనంతలక్ష్మీ, సహాయ కార్యదర్శి ఏ.సరోజను నియమించారు. అలాగే ఈ కార్యక్రమంలో సిపిఎం దుత్తలూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గుజ్జులా మల్లికార్జున, ఎన్.సింహాద్రి, మండల కమిటీ కార్యదర్శి సిఐటియు ఎస్కే గౌస్, జిల్లా కమిటీ సభ్యులు ఆశా వర్కర్స్ యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : డి.ఆర్. విశ్వోదయ సేవాసమితి వారు విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెంగళరావు నగర్‌లోని తమ కార్యాలయంలో డి.ఆర్. పేరుమీద 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేలు విలువ చేసే 10కేజీలు బియ్యం, వంటింటి సరుకులు, రొక్కం రూ.60 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ డి.ఆర్. గొప్ప మానవతావాది అని, విద్యాదాత అని, వారు సమాజానికి చేసిన సేవలు అమూల్యమని అన్నారు. వృద్ధులను ప్రతిఒక్కరూ గౌరంగా, ప్రేమగా చూడాలన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, జె.బి సెల్ఫ్ ఫైనాన్ డైరెక్టర్ మాల్యాద్రి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్ సింగ్ పాల్గొన్నారు.

భ.ని.కా. సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు

ఎన్నికైన నూతన కమిటీ

అధ్యక్ష, కార్యదర్శులుగా కాయంబు.శ్రీనివాసులు అల్లాడి గోపాల్

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ 13 మంది ఆఫీస్ బ్యారెర్స్‌గా మొత్తం 29 మంది సభ్యులతో నూతనంగా ఎన్నికైంది. ఈ సంఘానికి గౌరవ అధ్యక్షులుగా కె.అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడుగా కాయంబు శ్రీనివాసులు, కార్యదర్శిగా అల్లాగి గోపాల్ ఎన్నికైనట్లు నాయకులు ప్రకటించారు. ఆదివారం పెద్దపడుగుపాడు ప్రాంతంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 9 మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభోత్సవానికి ముందు భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు కోవూరు సెంటర్ ప్రాంతం నుంచి మహాసభ ప్రాంగణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మహాసభ ప్రారంభోత్సవానికి ముందుకు భ.ని.కా. జెండాను సీనియర్ నాయకులు ఛాన్‌బాషా ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్, పెయింటింగ్, విద్యుత్తు, కోయ్యపని, మార్బుల్, వెల్డింగ్ తదితర రంగాలల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఆగిపోయి ఉన్న క్లైయిమ్స్ అన్నింటిని కూటమి ప్రభుత్వం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోని భవన నిర్మాణ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ మహాసభల్లో సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సిఐటియు రూరల్ నాయకులు కొండా ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పి.సూర్యనారాయణ, ఆవుల పెంచలయ్య, కె.సంపూర్ణమ్మ, ఎస్‌కె ఖలీల్, ఎస్‌కె నజీర్, వై.రంగయ్య, ఎం.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..

- ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకటేశ్వరపురం, వేపచెట్ల దెబ్బ కాలనీలో ఎంఎల్ఎ పర్యటించారు. అనంతరం గడపగడపకు తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. వెంకటేశ్వరపురంలోని ఎస్‌టి కాలనీలో తాగునీరు ఇబ్బందిగా ఉండటంతో ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న గత ప్రభుత్వం వ్యవస్థను సరిదిద్దుకుంటూ 80శాతం వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చమన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంతో ప్రతిగడప తొక్కే ప్రజలు సమస్యలు తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఏకోళ్ళు పవన్ రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, పోన్నెబోయిన చెంచుకిషోర్ బాబు, గుండాల కృష్ణారెడ్డి, బండ్ల మల్లికార్జున గౌడ్, బండ్ల ఉదయ్ కుమార్ గౌడ్, డిస్ట్రిబ్యూటీ కమిటీ వైస్ చైర్మన్ దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సారె తీసుకెళ్తున్న వేమిరెడ్డి దంపతులు

అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలంలోని జొన్నవాడ గ్రామంలో పినాకిని నది తీరాన కొలువుతీరిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి ఆషాఢమాసం ప్రత్యేక పూజలను పురస్కరించుకొని ఆదివారం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సారే సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు వేమిరెడ్డి దంపతులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకాంబరి అలంకారంలో ఉన్న కామాక్షితాయి అమ్మవారిని వేమిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, లక్ష్మీకాంతమ్మ, సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, పలువురు కౌన్సిలర్లు, టిడిపి మండల నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి గెలిస్తే రాష్ట్రం అధోగతి

ప్రజాశక్తి-ఉదయగిరి

కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే మళ్లీ రాష్ట్రం అధోగతి పాలవుతుందని, పురోగతి ఉండదని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల గ్రామ నాయకుల నాయకత్వంలో, క్లస్టర్, యూనిట్, ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్ల సారథ్యంలో, ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలను అందజేసి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానికుల నుండి గ్రామ వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తన అనుభవ రాహిత్యంతో సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, నాయకులు షేక్. రియాజ్, గాజుల షర్ఫుద్దీన్, బొజ్జ నర్సింహులు, నల్లి పోగు రాజా, నరసింహులు, మట్ల రామలక్ష్మణులు, మహిళ నాయకురాలు జ్యోతి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి-కోవూరు

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని 32 మందికి రూ.26 లక్షల 29 వేల 742 విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 13 నెలల్లో ఇప్పటికి 13 సార్లు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనారోగ్య బారినపడి ఆర్థికంగా చితికి పోయి కష్టాలలో వున్న కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ సహాయం కొండంత అండ నిలుస్తుందన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 235 మంది అనారోగ్య పీడితులకు రూ.2 కోట్ల 80 లక్షల 90 వేల ఆర్థిక సాయం అందచేసి ఆదుకున్న సిఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భముగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. అలాగే నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని 26మంది అనారోగ్య పీడితులకు 74 లక్షల రూపాయలు సిఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పించారన్నారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు చెందిన టిడిపి నాయకులు ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, ఏటూరి శ్రీహరిరెడ్డి, మురళి, చెంచుకిషోర్, ముంగర గోపాల్, మధు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కావలి

ఆదివారం డి.బి.ఎస్ పాలిటెక్నిక్ కళాశాల ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామిశెట్టి. బాలసురేష్‌బాబు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల అనుబంధంగా పాలిటెక్నిక్ కళాశాల ఉండడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని, విద్యార్థి ప్రథమ సంవత్సరం నుండి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని చదువు కొనసాగించాలని సూచించారు. ఆసక్తితోనే అన్ని విషయాలు నేర్చుకోగలమని కళాశాల సెక్రెటరీ పేర్కొన్నారు. కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి. సుధీర్‌నాయుడు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని ప్రతివిద్యార్థి ల్యాబ్‌లు, లైబ్రరీ చక్కగా వినియోగించుకొని మంచి భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కళాశాల పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దామిశెట్టి.మల్లికార్జున రావు, పరిపాలన అధికారి జి.రమేష్ బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అన్నివిభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపరకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-సీతారాంపురం : మండలంలోని 14 పంచాయతీల్లో పి-4 సర్వేపై గ్రామ సభలను సోమవారం నుంచి నిర్వహించినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ అప్పాజీ ప్రకటన ద్వారా తెలిపారు. 21న అయ్యవారిపల్లి, నిమ్మలదిన్నె, జయపురం, పబ్బులేటిపల్లి, చిన్న నాగంపల్లి, సింగారెడ్డి పల్లె, 22,న దేవరాజు సూరాయిపల్లి, దేవిశెట్టిపల్లి, దేవమ్మ చెరువు, బసినేనిపల్లె, బాలాయపల్లె, గుండుపల్లె, మారంరెడ్డిపల్లి, సీతారాంపురం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు.

23న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సీతారాంపురం : మండల పరిషత్ కార్యాలయంలో 23న ఉదయం 10:30 గంటలకు ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ అప్పాజీ తెలిపారు. మండల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మహారాజశ్రీ శ్రీయుత పిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో,ఒంగోలు
A.S.NO.78/2023
కోట నరశింగారావు ..అప్పెలెంట్
Vs
ముప్పరాజు అంజయ్య మరియు 20 ఇతరులు .....రెస్పాండెంట్లు
TO
R10:- రావూరి చిన్నా, తండ్రి కోటయ్య, హిందువు, వ్యవసాయం, వయస్సు 49 సం.లు,
నివాసం: వెంకటాద్రిపాలెం గ్రామం, కందుకూరు నగరం మరియు మండలం, ప్రకాశం జిల్లా, ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
R16):-
బత్తిన వెంకటేశ్వర్లు, తండ్రి పెదకొండయ్య, హిందువు, తాపీ మేస్త్రీ, వయస్సు 46 సం.లు,
నివాసం: శింగమనేనిపల్లి గ్రామము, వలేటివారిపాలెం మండలం, ప్రకాశం జిల్లా, ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
అప్పీలు నోటీసు
పై నెంబరు అప్పీలును అప్పెలెంట్ మీపై మరియు ఇతరులపై కందుకూరు కోర్టు వారు ఐ.పి. నెం.39/2016 నందలి ఇచ్చిన తీర్పు తేది.18-04-2023 పై, పై నెంబరు అప్పీలును దాఖలా చేయగా కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా మీకు అప్పీలు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పైనంబరు అప్పీలు మీయొక్క హాజరు నిమిత్తమై తేదీ:07-08-2025 నకు వాయిదా అయి వున్నది, కనుక సదరు వాయిదా తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు మీరు స్వయముగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ కోర్టు వారి ఎదుట హాజరు అయి మీకు గల అభ్యంతరములను వ్రాత పూర్వకముగా తెలియ చేసుకొనగలరు, లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానము చేయబడునని తెలియచేయ దమైనది.
// కోర్టు వారి అనుమతితో //
స్థలం : ఒంగోలు
తేది : 20-07-2025
వాయిదా తేది : 07-08-2025 ఇట్లు
పి.వి. శ్రీనివాస గుప్తా,
కె.ఆర్. తిమోతిపాల్,
న్యాయవాదులు, ఒంగోలు, ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్:9866447247